# అక్షరమే ఆయుధం..

## విలువల కోటలో నేడు సున్నా అంకం

### పేదరికాన్ని జయించే ఏకైక మార్గం చదువే..

### స్వార్థం వైపు మళ్లుతున్న సమాజం.. కనుమరుగవుతున్న మానవత

లోకం నలుమూలలా వెలుగులు విరజిమ్మాలన్నా, కటిక చీకటి లాంటి పేదరికం నుంచి బయటపడాలన్నా చదువు ఒక్కటే మార్గం. ఏ దిక్కూ లేని వారికి, ఆసరా కరువైన వారికి అక్షరమే వెన్నెముకై నిలుస్తుంది. విజ్ఞానం పెరుగుతున్న కొద్దీ విజ్ఞత తగ్గుతుండటం నేటి సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు చదువు మనిషిని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్తుంటే, మరోవైపు క్షీణిస్తున్న మానవతా విలువలు మనిషిని పాతాళానికి దిగజారుస్తున్నాయి. అనాథల పాలిట కల్పవృక్షం. ఆస్తిపాస్తులు లేనివారికి, ఆపన్న హస్తం కోసం ఎదురుచూసే వారికి విద్య అనేది కేవలం పుస్తకాల్లోని పాఠం కాదు.. అది బతుకు పోరాటంలో ఒక ఆయుధం. ఏ ఆధారం లేని బిడ్డకు ఒక డిగ్రీ లేదా ఒక నైపుణ్యం ఇచ్చే ధైర్యం వేల కోట్ల సంపద కూడా ఇవ్వలేదు. నేడు అవసరం మనిషిని ఎక్కడికైనా నడిపిస్తుంది. కడుపు నింపుకోవాలనే తపన, జీవితంలో స్థిరపడాలనే కసి ఉన్నప్పుడు చదువు కోసం ఎన్ని మైళ్లయినా ప్రయాణించేందుకు నేటి యువత వెనుకాడటం లేదు. సప్త సముద్రాలు దాటి వెళ్తున్నారంటే అది కేవలం అక్షరం అందించిన ఆత్మవిశ్వాసమే.

**విలువలు ఏవీ? మానవత్వం ఎక్కడ?**

చదువు మనిషిని వివేకవంతుడిని చేయాలి. కానీ, నేటి పోటీ ప్రపంచంలో ర్యాంకుల వేటలో సంస్కారం వెనుకబడిపోతోంది.

ఉన్నత శిఖరాలకు చేరుకున్న తర్వాత కన్నవారిని, కష్టకాలంలో సాయం చేసిన వారిని మర్చిపోవడం ఒక సామాజిక జాడ్యంగా మారుతోంది.

సెల్‌ఫోన్ ప్రపంచంలో పక్కవాడు ఆపదలో ఉన్నా పట్టించుకోని స్థితికి చేరుకున్నాం. ఆపదలో ఉన్నవారికి సాయం చేసే చేతుల కంటే, వీడియో తీసే చేతులే ఎక్కువవుతున్నాయి. నాకు లాభం ఉంటేనే నేను కదులుతాను అనే ధోరణి పెరిగిపోవడం వల్ల సమాజంలో నైతిక విలువల కోట కూలిపోతోంది.

**అవసరం.. మార్పుకు పునాది కావాలి.**

అవసరం అనేది మనిషిని కష్టపడేలా చేస్తుంది. కానీ ఆ అవసరం కేవలం ఆర్థిక వృద్ధి కోసమే కాకుండా, సామాజిక బాధ్యత కోసం కూడా ఉండాలి. చదువుకున్న వారు పదిమందికి మార్గదర్శకులుగా మారినప్పుడే ఆ అక్షరానికి సార్థకత లభిస్తుంది. చదువు అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదు, ఒక మంచి సమాజం నిర్మాణం కోసం కావాలి. ఏ దిక్కు లేని వారికి చదువు దారి చూపిస్తుంది, కానీ ఆ దారిలో మానవత్వం తోడైతేనే అది పరిపూర్ణ ప్రయాణం అవుతుంది. విలువల లేని విద్య.. వాసన లేని పువ్వు లాంటిది. ఇప్పటికైనా చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకుందాం.. మానవత్వాన్ని కాపాడుకుందాం.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103